# మీనలోచని

ఆరోజు నిండు పున్నమి. పగలంతా పనితో గడిచి పోయింది. కాని సూర్యాస్తమయంతో నాలోని ఉత్సాహమంతా ఒక్కసారి నశించిపోయింది. పరాయి ప్రదేశం. వెన్నెల రాత్రి. ఒంటరితనం అన్నీ కలసి కుట్ర చేసి నామీద దాడిచేశాయి.

హోటలుకు చేరి భోజనం చేశాను. ఏమి చెయ్యాలో తోచటం లేదు.

రాత్రి ఎన్నో గంటలు గడిస్తేనే కాని మళ్ళీ పగలురాదు. అప్పుడు కాని మళ్ళీ పని ఉండదు.

పోనీ ఏదైనా సినిమాకు వెడితే? ఏమి లాభం? తిరిగి వచ్చిన తరువాత యింతకంటె ఎక్కువ బాధపడాలి.

ఎవరితోనైనా యీ రాత్రి గడపాలి సరదాగా- ఈ హోటలు గదిలో ఎంతకాలం యిలా ఒంటరిగా ఉండటం ?

రోజులు గడిచిపోతున్నాయి. నెలలు సంవత్సరాలు అనంతంలో కలిసి పోతున్నాయి. ఇహ ఏనాడు తిరిగి రావు. కాని యీ ఒంటరితనం ఎల్లా పోతుంది?

ఈ రాత్రి ఎవరైనా వేశ్యతో గడిపితే? ... అదే ఉత్తమమైన మార్గం. డబ్బుతో సుఖాన్ని సంపాదించడం నాకు చాతకాదు.

ఈ ఆలోచన నాలోని చికాకులు దూరం చేసి ఎనలేని ఉత్సాహాన్ని తెచ్చిపెట్టింది.

వరండాలోకి వెళ్ళి నా గదిలో పనిచేసే కుర్రవాడిని పిలిచాను. కుర్ర వాడంటె- కుర్రవాడేం కాదు. సుమారు 30 సంవత్సరాలు ఉంటాయి. "రామయ్య!" అంటూ పిలిచాను. వాడు ఎక్కడ నుంచో 'సార్' అంటూ వచ్చాడు. ఒకటి రెండు క్షణాలు తటపటాయించి- "నీకు యీ వూళ్ళో మంచి భోగం వాళ్ళు ఎవరైనా తెలుసునా?' అని అడిగాను.

వాడు నావంక ఎగాదిగా ఒక్కసారి చూసి

"తెలుసు సార్" అని అన్నాడు.

"వెడదాం పద."

"ఒక్క క్షణంలో వస్తాను సార్" అని అంటూ మంచి బట్టలు వేసుకుని సిద్ధంగా ఉన్నాను.

వాడిని చూడగానే నాకు ఒక్కసారిగా నవ్వు వచ్చింది. పైపై బేధాలు ఎన్ని ఉన్నా మనుష్యులంతా ఒక్కటే. ప్రేమ, మోహం, కామం, క్రోధం, ద్వేషం- వీటికి గొప్ప బీద యీ బేధాలు కనిపించవు. అంతస్థులు వేరు ఆంతర్యాలు అన్నీ ఒక్కటే. ఎవరినైనా చూడటానికి వెళ్ళేప్పుడు రిక్తహస్తములతో వెళ్ళకూడదంటారు. వెళ్ళేది వేశ్య దగ్గరికైనా, ఏ విషయంలోనైనా సరే ఉభయులకీ ఆనందం కలిగించే పని ఎన్నటికీ చెడుగా మారదు.

బజారులో ఒక్క మల్లెపువ్వుదండ రెండు చక్కటి దానిమ్మపండ్లు కొన్నాను. నా పక్కనున్న మనిషి "ఇవ్వన్నీ ఎందుకు సార్?" అని ప్రశ్నించాడు. "నీకు తెలియదులే" అని సమాధానం ఇచ్చాను.

పెద్ద వీధులు బజారులు దాటి ధనంతో స్త్రీలని కొనగలిగే బజారులో అడుగు బెట్టాం. ప్రతి ఇంటి గుమ్మంలోనూ విటులకై ఎదురుచూస్తున్న వేశ్యలు కనబడ్డారు. ఎన్ని రకాల మనుష్యులు! ఒక్కొక్క వ్యక్తి జీవితంలో ఎన్ని సుడిగుండాలు, ఎన్ని అగాధాలు ఉన్నాయో! ఆ తళుకు బెళుకులు ఎన్ని మాయని గాయాలని కప్పిపుచ్చాయో! వీళ్ళందరూ తమ ఇష్టం మీదనే ఈ వృత్తిలోకి దిగారా! అల్లా అయితే అందరిలో కూడా సంచారిణీ లక్షణాలు కనిపించాలే!

'సార్!' అన్న పిలుపు నన్ను మళ్ళీ ఈ ప్రపంచంలోకి తీసుకువచ్చింది. ఒక పెద్ద భవంతి వద్ద ఇద్దరం నిలబడి ఉన్నాం. ఆ ఇంట్లో ఎటువంటి అలజడీ, హడావిడీ లేదు; చాలా నిశ్శబ్దంగా ఉంది.

గుమ్మంలో నలభై యాభై సంవత్సరాల మధ్య వయస్సులో ఉన్న వ్యక్తి కూర్చుని వుంది. రామన్న దారి తీశాడు. నేను అనుసరించాను. మమ్మల్ని చూడగానే దిగ్గున లేచి నుంచుని 'దయ చేయండి, దయ చేయండి' అని అంది. రామయ్యని చూసి 'ఏం రామయ్యా బావున్నావా!' అని క్షేమసమాచారం అడిగింది.

'ఓ నిక్షేపంలాగా ఉన్నాను. అయ్యగారు ఈపూట ఇక్కడ ఉంటారు' అని అన్నాడు.

"చాలా సంతోషం బాబూ! లోపలికి దయచేయండి" అని లోపలికి సావిడిలోకి తీసుకువెళ్ళింది.

ఇంటిలోపలి భాగం చాలా బాగుంది. వేశ్యల ఇండ్ల లోపలి భాగం చాలా జుగుప్సాకరంగా ఉంటుందని నా స్నేహితులు చెప్పినవన్నీ కల్లలనిపించింది. చాలా మర్యాదస్థులు, ధనికులైన వాళ్ళ లోగిళ్ళని గుర్తుకుతెచ్చింది- ఇతర వేశ్యల ఇళ్ళు కూడా ఇలాగే ఉంటాయా! ఇంత ఆడంబరంలో నివసించే సాని ఒక్కరాత్రి ఎంత పుచ్చుకుంటుందో! ఇటువంటి ప్రశ్నలు చాలా నా మనస్సులో ప్రవేశించి నన్ను కలవరపరిచాయి.

"కూర్చోండి అమ్మాయిని పిలుస్తాను" అని ముసలావిడ అంది.

"ఫరవాలేదు నేనే వెళతాను లెండి" అని అన్నాను.

ఆవిడ ఒక్కక్షణం ఊరుకొని "అల్లాగే మేడమీద మొదటి గదిలో ఉంది. దయ చేయండి. తమకేమన్నా కావలిస్తే చెప్పండి. హాజరు పరుస్తాను" అంది.

"ఏమీ అక్కరలేదు. అమ్మాయి పేరేమిటన్నారు?"

"మీనలోచని!"

ఆ పేరు వినగానే నాకు ఒక్కసారి పెద్దపెట్టున నవ్వు వచ్చింది. ఎవరో సుబ్బమ్మలు అచ్చమ్మలను తీసుకువచ్చి, గిల్టు నగలతో అలంకరించి వాళ్ళకి యీ ప్రబంధ నాయికల పేర్లు తగిలించి మన ప్రాణాలు తీస్తారు.

చాలా తాపీగా, ఏ మాత్రం తొందరపాటు లేకుండా ఒకమెట్టు తరువాత ఇంకొకటి చొప్పున ఎక్కుతూ గమ్యస్థానం చేరాను. గది ముందర ఒక లేసు తెర వెనుక అరమోడ్పుగా మూసిన తలుపులు. చప్పుడు చేయకుండా గదిలో ప్రవేశించాను. పందిరిమంచం మీద అడ్డంగా పడుకుని ఒక సుందరాంగి ఏదో చదువుకుంటోంది. పుస్తకం సైజు, రూపం అది వావిళ్ళవారి తాలూకు అని చెప్తున్నాయి. నేను పువ్వులు, పళ్ళు బల్లమీద పెట్టి ఒక్కక్షణం చూస్తూ నిలబడ్డాను. ఏదో చాలా ధ్యానంగా చదువుకుంటున్న పిల్లదాన్ని పలకరించి అనవసరంగా కంగారు పెట్టడం దేనికనిపించింది. కానీ ఎంతసేపని మాట్లాడకుండా కూర్చోవడం? కంఠంలోకి సాధ్యమైనంత మార్దవం తెప్పించి,

"మీనా" అని పిలిచాను.

ఉలిక్కిపడి ఒక్కక్షణం అయోమయంగా నావంక చూసింది. చూసి వెంటనే మంచం దిగింది. నాకు నమస్కరించింది. చిరునవ్వుతో "చూడలేదు, క్షమించండి' ' అంది. వేశ్యలలో కూడా యింత సభ్యత వుంటుందా అనిపించింది.

"ఫరవాలేదులే... అన్నట్టు నీకోసం యివి తీసుకొచ్చా" అని పళ్ళు, పువ్వులు ఆ పిల్ల చేతిలో పెట్టాను. నావంక ఒకటి రెండు క్షణాలు చూసి వెంటనే వెనక్కి తిరిగింది. కాని కాస్సేపటి వరకు ఏమీ మాట్లాడలేదు. నిశ్శబ్దం భరించలేక నేనే మళ్ళా 'మీనా' అని పిలిచాను.

తిరిగి నా వంక చూసింది. కన్నీటితో ముఖమంతా తడిసిపోయి వుంది. "ఎందుకు ఏడుస్తున్నావు? నీ మనస్సు నొప్పించానా? నన్ను క్షమించు" అని అన్నాను. నాకంతా అయోమయంగా ఉంది. ఏదో తోచక యిటు వస్తే యీ గొడవ ఏమిటి అనిపించింది. మాట్లాడకుండా ఆ చిన్నదానివంక చూస్తూ కుర్చీలో కూర్చున్నాను. ఎవరో మహాత్ముడైన శిల్పి తన తపస్సంతా ధారపోసి సృష్టించిన

కళాఖండంలా ఉంది. కాని- పరిణామం ఏమిటి? ఈనగాచి నక్కలపాలు చేసినట్టు ఇంత శ్రమపడి చివరకు వేశ్యగానా చేసింది? వెలయాలు!!! ఇక అక్కడనుంచి లేచి ఏదన్నా సినిమాకు పోతే బాగుండును అనిపించింది. మాట్లాడకుండా కుర్చీలోంచి లేచాను. 'వెడుతున్నాను' అన్నాను. ఆమె ఒక్కసారిగా వులిక్కిపడి 'వెడుతున్నారా' అని అడిగింది. నేను సమాధానం చెప్పేలోపలే నా రెండు చేతులూ పట్టుకుని కూర్చోపెట్టి "కూర్చోండి. నామీద కోపం వచ్చిందా? ఇక్కడకు అనేకమంది వ్యక్తులు వస్తుంటారు. కానీ వాళ్ళెవరికీ కూడా నేను కూడా తమలాగానే ఒక మనిషిననే ఆలోచన ఎప్పుడూ కలిగినట్టు కనిపించలేదు. వస్తారు- ఏదో నేను యంత్రాన్ని అయినట్టు తమ వాంఛ తీర్చుకొని, వచ్చినప్పటికంటే ఏదో తప్పు చేసినవాళ్ళలాగా దొంగచాటుగా యిళ్ళకి వెళ్ళిపోతారు... కానీ యీనాడు మీరు అంతా మార్చి వేశారు. పువ్వులు, పళ్ళు అర్పించి నన్ను ఒక దేవతను చేశారు. ఈనాటికి నాకు నేను కూడా మనిషినే అన్న ఆనందం కలిగింది. ఆ ఆనందాన్ని నేను అణచుకోలేకపోయాను. నా మనస్సులో కరడుగట్టిన బాధంతా ఒక్కసారిగా కరిగి బయటకి ప్రవహించింది."

ఈ వాక్ప్రవాహాన్ని ఆపేశక్తి నా దగ్గరేముంది. కానీ ఎవరా వేశ్య? ఏమిటి ఆవిడ కథ? ఏదో విశేషం ఉంది కనుకనే ఏదో అదృశ్యశక్తి నన్ను యిక్కడికి లాక్కొచ్చిపడేసింది.

"మీకు వివాహమైందా?" యీ ప్రశ్నతో నాలో ఒక్కసారి చైతన్యం కలిగింది.

"లేదు."

"ఇంతవరకూ మీకు వేశ్యలతో సంపర్కం లేదనుకుంటాను."

"లేదు." ఏమిటీ శల్యపరీక్ష అని నాలో నేను నవ్వుకున్నాను.

"నువ్వు సానివేనా?" అని అడిగాను.

"ఏం అలా అడిగారు?"

"మీ మాట, నువ్వు చదువుతున్న పుస్తకం కాదని చెబుతున్నాయి."

"డబ్బు పుచ్చుకొని నా మానాన్ని అమ్ముతున్నాను. నేను వేశ్యనో కానో మీరే నిర్ణయించండి."

"నువ్వు భోగందానివి కాదు. ఎవరో కాలుజారిన పిల్లవి..."

"భోగంవాళ్ళంటూ కొత్తగా ఒకళ్ళున్నారటండీ! కాలుజారిన వాళ్ళంతా భోగంవాళ్ళే."

"నిన్ను గురించి నాకు చెప్పగలవా?"

"ఏం చెప్పను? మా నాన్న చాలా బీదవాడు. సంసారం పెద్దది. తంటాలు పడుతూ సంసారాన్ని ఈదుతూవుండేవాడు. నేనంటే చాలా ప్రేమ. 'సరోజినీ, సరోజా' అని పిలుస్తూ నన్ను ఒక్క క్షణం కూడా వదిలిపెట్టేవాడు కాదు. నా కోరికలు తీర్చేవాడు. కాని నా వివాహం చేయడం ఆయన శక్తికి మించిన పని అయింది. ఎవరిని అడిగినా 'ఎన్ని వేలు ఇస్తావు' ఇదే ప్రశ్న. 'పిల్ల అందమైనది. సంస్కృతం, తెలుగు వీటిల్లో చాలా కృషి చేసింది. సంగీతం బాగా పాడుతుంది' అని పొగిడిన వాళ్ళే తీరా పెళ్ళిపేరు ఎత్తేసరికి ముఖం తప్పించేవారు. నాలుగు సంవత్సరాలు గడిచాయి. ప్రతివాళ్ళూ 'మీ అమ్మాయికి యింకా పెళ్ళి కాలేదే' మని దెప్పిపొడిచేవారు. సహనం అంతాన్ని చూసింది. 'వారంరోజుల్లో దీని పెళ్ళి చేయకపోతే మారుపేరు పెట్టి పిలవమని' సవాలుచేసి బయలుదేరాడు. ఆవేశంలో చేసిన ఏ పని సుఖాన్ని యిస్తుంది? తనకంటే పెద్దవాడికి ఇచ్చి తన బాధ్యత తీర్చుకున్నాడు. 'కన్యా వరయితే రూపం' అన్నమాట త్రేతాయుగంలో కలిసి పోయింది. పెళ్ళి అంటే ఆడపిల్లవాళ్ళకి ఏదో పెద్ద భారం నెత్తిమీదనుంచి దింపుకోడం- ఎలాగో ఒకలాగ యీపీడ వదిలించుకుని గట్టెక్కడం. వాళ్ళు నిజంగానే గట్టెక్కారు. భర్త మామగారికి ఐదువేల రూపాయిలు మాత్రం యిచ్చి తన కృతజ్ఞత చూపించుకున్నాడు. అన్నట్టు చెప్పడం మరచిపోయాను. ఆయనకు అట్టే వయస్సు లేదు. అరవైఅయిదో, అరవైఆరో వుంటాయి. పెళ్ళికి మాత్రం చెప్పడం యాభై అన్నారు. ఐనా ముసలివాడైన తరువాత పది అటైతేనేం- యిటైతేనేం? అని ఎవరూ గట్టిగా ప్రశ్నించలేదు.

అత్తగారింటికి వచ్చాను. నా ప్రణయ జీవితం ప్రారంభమైంది. ఆయన అసలే అనుమానం పెద్దమ్మ. కూర్చుంటే తప్పు. నుంచుంటే తప్పు. మంచి చీర కట్టుకుంటే తప్పు. కట్టుకోకపోతే తప్పు. నన్ను రాచిరంపాన పెట్టేవాడు. ఇంతలో నా ప్రాణానికి యముళ్ళలాగా ఎదురింటికి ఎవరో కాలేజీ పిల్లలు అద్దెకు వచ్చారు. దాంతో ఆయనగారి పని- అసలే కోతి, అందులో కల్లు తాగింది, నిప్పు తొక్కింది వగైరా అయ్యింది. ఆయన ఎక్కడికన్నా వెళ్ళేటప్పుడు తాళం వేసి వెళ్ళేవారు. అన్నీ సహించి వూరుకున్నాను. ఒకరోజున తలంటు పోసుకుని తులసికోట దగ్గర తల ఆరబెట్టుకుంటూ కూర్చున్నాను. ఇదేసమయంలో ఎదురింటి పిల్లలు మేడమీద తిరుగుతున్నారు. ఇది ఆయన కళ్ళబడ్డది. ఇంకేముంది! నోటికి వచ్చిన మాటల్లా అని బయటకు నెట్టేసి గడియపెట్టుకున్నారు. నేను ఏడ్చాను. మొత్తుకున్నాను, బ్రతిమాలాను. ఊహూఁ! ససేమిరా తీయనని అన్నారు. ఇలా బ్రతకటం కంటే చావటం మేలనిపించింది. ఆడదాన్నై పుట్టడం కంటే అడవిలో మానై పుడితే హాయిగా వుండేది. రైలు కిందపడి చచ్చిపోదామని బయలుదేరాను.

కాని అదికూడా సాధ్యంకాలేదు. రోడ్డుమీద నడుస్తుండగానే మధ్యదారిలోనే తలతిరిగి పడిపోయాను. ఏమైందో నాకు తెలియదు. కానీ తెలివి వచ్చేసరికి ఒక మంచం మీద ఉన్నాను. ఒక ముసలావిడ నా ప్రక్కన కూర్చుని ఉపచారం చేస్తోంది. రెండు రోజులు అక్కడే గడిచాయి. మూడోరోజున మెల్లగా మాటల సందర్భంలో నన్ను గురించి అడిగింది. నేను ఏదీ దాచకుండా చెప్పేశాను. నా కథ విని ఎంతో జాలితో 'ఎంత కష్టం వచ్చిందమ్మా నీకు! ఇక ఆ నరకంలోకి వెళ్ళకు. మా చెల్లెలి ఊరు పంపుతాను. దాని దగ్గర హాయిగా వుండు. హాయిగా చూసుకుంటుంది' అని చెప్పింది. ఆవిడ మాటలు నమ్మి ఇక్కడకు వచ్చాను. నాకు ఏ లోపం జరగలేదు. కానీ నేను వేశ్యగా మారాను. మొట్టమొదట్లో సిగ్గుతో, అవమానంతో, జుగుప్సతో భరించలేక ఏడ్చేదాన్ని. కాని అన్నీ అలవాటైపోయాయి. మానాన్న చెప్పించిన చదువుతప్ప అన్నీ నన్ను వదలి వెళ్ళిపోయాయి.... ఇదీ నా కథ."

"ఇదా నీ కథ" అని మనస్సు తిరిగి ప్రశ్నించింది. ఈ సమస్యకు పరిష్కారం ఏమిటి? ఇలా ఎంతమంది నాశనమైపోతున్నారు?

"సరోజినీ" అని పిలిచాను.

"చెప్పండి" అంది.

"ఇలా రా" అని నేనే లేచి ఆ పిల్లదాన్ని పక్కన కూర్చోపెట్టుకున్నాను. "ఈ నరకం దాటి బయటపడకూడదూ" అని అడిగాను.

ఆ పిల్లదాని కనుబొమలు నన్ను 'ఎలా' అని ప్రశ్నించాయి.

"చూడు సరోజినీ! నువ్వు నావెంట వచ్చేసెయి. నీకు ఎవరూ లేరు. మనం ఇద్దరం వివాహం చేసుకుందాం. ఏలోటూ లేకుండా హాయిగా వుండవచ్చు."

రెండు క్షణాలు నావంక చూసి చిరునవ్వు నవ్వి తల అడ్డంగా వూపింది.

"ఏం" అని ప్రశ్నించాను.

"మీరే నెమ్మదిగా ఆలోచించుకోండి. ఏదో నామీద జాలికొద్దీ ఆవేశంలో వివాహం చేసుకుందాం, నావెంట రమ్మని అన్నారు కానీ, తీరా వివాహం చేసుకున్నాక మీరే పశ్చాత్తాప పడతారు. మిమ్మల్ని చూస్తే ఒక సంగతి తెలుస్తోంది."

"ఏమిటది?"

"జీవితాన్ని గురించి మీకు అట్టే ఏమీ తెలియదు. లేకపోతే ఇతరుల కష్టాన్ని గురించి మీరు ఇంత బాధపడరు. మీ భార్య వేశ్య అని తెలిస్తే నలుగురిలో తల ఎత్తుకుని ఎలా తిరగగలరు? రగిలి రగిలి అగ్ని ఏనాడో బయటకు వస్తుంది. ఆనాడు మళ్ళీ నేను నాదారి చూసుకోవలసిందే. ధనమా పోవును. మానమా

చెడును అన్న పద్ధతిని మీ జీవితం కూడా నాశనం అవుతుంది. వెళ్ళండి. వెళ్ళి ఎవరైనా మంచి కుటుంబంలోని పిల్లను చూసి వివాహం చేసుకోండి."

"సరోజినీ..."

"నన్ను చెప్పనివ్వండి. మీరు ఇంకా చిన్నవారు. జీవితాన్ని గురించి మీకు పూర్తిగా తెలియదు. కాని మీరు ప్రేమించగలరు. మీ ప్రేమనీ, యవ్వనాన్నీ కోరగాని వాళ్ళదగ్గర ప్రదర్శించకండి. ఇలా నిర్మొహమాటంగా అంటున్నానని అనుకోకండి."

"వెడుతున్నాను సరోజా! కానీ ఒక్క ప్రార్థన! నేను ఎప్పుడైనా నీ దగ్గరకు రావచ్చునా?"

"సోదరులులాగా, స్నేహితులులాగా రండి. సరసులులాగా రావద్దు. ప్రొద్దు పోయింది. మీరు పడుకోండి. నేను వెడుతున్నాను."

"ఎక్కడికి?"

"క్రిందికి."

నేను మారుప్రశ్న వేసేలోపలనే మెట్లు దిగి కిందికి పోయింది. సరే యిక చేసేదేముంది. దానిమ్మపండు వలిచి ఒక చెక్క తిని మంచం మీద పడుకున్నాను. మనస్సు పరిపరి విధాల పోయింది. ఆరోజున జరిగిన సంఘటనలన్నీ మనస్సులో మెసలి మాటుమణిగాయి. కర్తవ్యం ఏమిటి? సరోజినిని యిక్కడనుంచి తీసుకువెళ్ళిపోతే? కానీ తను రాదుగా! రేపు మళ్ళీ వచ్చి ప్రయత్నం చేస్తా. అంతగా ఒప్పుకోకపోతే ఏదో ఒకటి చేయాలి. ఏం చేయాలి?

ఉదయం నేను నిద్రలేచేసరికి చాలా ఆలస్యం అయింది. కళ్ళు తెరిచి చూసేసరికి ఆ చిన్నది ఎదురుగుండా కనిపించింది. కాఫీ ఫలహారం అవీ అక్కడే చేసి మా హోటలుకి వెళ్ళాను. అక్కడ అప్పటికే నాకోసం ఒక టెలిగ్రాం సిద్ధంగా ఉంది. 'రేపు సాయంత్రానికి మైసూరు రా' అని మా యజమాని ఆజ్ఞ యిచ్చాడు. రైలు ఇంకొక గంటలో బయలుదేరుతుంది అని తెలిసింది. వెళ్ళేలోపు సరోజినిని కలుసుకోకుండా ఎలా వెళ్ళడం? కాని అదెలా సాధ్యం? తర్కవితర్కాలతో సతమతమవుతూనే రైలెక్కాను. రైలు మన విషయాలతో సంబంధం లేకుండా తనదోవని అది మైసూరు చేరింది.

రోజులు, వారాలు, నెలలు గడచిపోయాయి. కానీ తిరిగి సరోజిని దగ్గరకు వెళ్ళలేకపోయాను. పని ఒత్తిడి చచ్చిపోవడానికి కూడా తీరికనివ్వలేదు. కానీ రోజూ ఒకటే ఆలోచన 'సరోజిని ఎలా ఉందో!' ఐనా ఆ మనిషిలో ఆ విచిత్రమైన శక్తి ఏమిటో! కొద్ది నిమిషాలలోనే జన్మజన్మలనుంచి తెలిసినంత సన్నిహితురాలైన

వ్యక్తిలాగ అయ్యిందే! నేను సరోజినిని ప్రేమిస్తున్నానా! ఏమో! నాకు మాత్రం నిర్ధారణగా తెలియదు.

చివరకు ఎలాగైతేనేం ఆటవిడుపు వచ్చింది. నా దగ్గర వున్న డబ్బంతా తీసుకుని బయలుదేరాను. ఏమైనా సరే సరోజినిని ఒప్పించి నావెంట తీసుకు రావలసిందే. నా భార్య కాకపోతే సరే కాని, నా స్నేహితురాలిగా తీసుకురావాలి. ఇది నా విధ్యుక్త ధర్మం. రేయింబవళ్ళు రైల్లో ప్రయాణం చేసి అలిసిపోయి సాయంకాలం నాలుగు గంటలకి నా గమ్యస్థానం చేరాను. పూర్వం బసచేసిన హోటలులోనే మకాం చేశాను.

వెంటనే బయలుదేరి సరోజినిని చూడటానికి వెళ్ళాను. యిల్లంతా నిశ్శబ్దంగా వుంది. హాలులో ఎవరూ లేరు. రెండు మూడు నిముషాలు ఎవరైనా వస్తారేమోనని చూచాను. కాని ఎవరూ వచ్చే సూచన కనిపించలేదు. ఇలా వూరుకుంటే లాభంలేదని బిగ్గరగా 'సరోజినీ- సరోజినీ' అని పిలిచాను. దాంతో ఇంట్లో వెంటనే సంచలనం కలిగింది. లోపలినుంచి 'ఎవరదీ' అని ఒక కంఠం వినిపించింది. ఆ ధ్వని వచ్చినవైపు చూస్తూ నిలుచున్నాను. ఒక పదహారు పద్దెనిమిదేళ్ళ పిల్ల వచ్చి నన్ను ఒక్కక్షణం పరకాయించి చూసి 'దయచేయండి' అంది.

"సరోజిని ఏది" అని అడిగాను.

"సరోజినా? ఇక్కడ సరోజిని ఎవరూ లేరండీ."

"పోనీ, మీనలోచని అనే అమ్మాయి వుందా?"

"ఎవరూ లేరండి."

నాతో మాట్లాడుతూ ఆ చిన్నది ప్రక్కకి చూచింది. ముఖంలో భావం ఒక్కసారిగా మారిపోయింది. ఏమిటా అని నేను అటుప్రక్కకి చూచాను. ఎవరో భయంకరమైన వ్యక్తి అటునుంచి వస్తోంది. ఎవరది గుర్తుపట్టలేనంతగా మారి పోయింది. నా గుండె ఒక్కసారిగా ఆగిపోయి వెంటనే వెయ్యి రైలింజన్ల వేగంతో కొట్టుకోవడం మొదలుపెట్టింది. ఒక్క అంగలో దగ్గరకు వెళ్ళి 'సరోజినీ' అని చెయ్యి పట్టుకున్నాను. ఎంతో బలవంతం మీద నా వంక చూసి 'మీరా! నన్ను ముట్టుకోకండి' అంది.

"ఏమిటిది సరోజినీ! ఏమిటిదంతా!"

"ఏమీలేదు."

"ఏమీ లేకపోవడమేమిటి? పద డాక్టరును పిలుచుకువస్తాను."

సరోజిని చెయ్యి పట్టుకుని లోపలికి బయలుదేరాను. నాతో మాట్లాడిన పిల్ల, ముసలిది కలిసి వస్తున్నారు. ముసలిదాన్ని చూడగానే నాకు ఒళ్ళు మండి పోయింది. "నువ్వు మనిషివా, పశువ్వా" అని అన్నాను.

"ఎవరండీ మీరు? ఇంట్లోకి చొరబడి ఏమిటి ఈ అల్లరి?"

"అల్లరి ఎవరిదో తెలుస్తూనే వుందిగా! ఈ పిల్ల ఎంత బాగా వుండేదో తెలుసుగా? ఏనాడు ఇట్లా ఎందుకయ్యింది. మందు ఇప్పించావా?"

"అడ్డమైన సంకటాలు తగిలించుకుంది. అదే అనుభవిస్తోంది. మందు ఎవరు ఇప్పిస్తారు?"

"ఈ మాటలు పోలీసులతో అను. ఇప్పుడే నేను వెళ్ళి పోలీసులను పిలుచుకు వస్తాను" అని రెండడుగులు ముందుకు వేసాను.

ఏమనుకుందో ఏమో కాని ముసలిదాని కంఠస్వరం వెంటనే మారింది. "మందు ఇప్పించకేం బాబూ! దాని బాధ చూస్తుంటే ఒక్కొక్కప్పుడు నా మనస్సుకి కష్టం కలిగి దానిమీద కోపం వస్తుంది."

"ఈ విషయాలన్నీ తరువాత చెప్పవచ్చుకానీ ముందు ఆమెకు ఒక శుభ్రమైన పక్క వెయ్యి."

ఒక మంచి పక్క మీద సరోజినిని పడుకోబెట్టి బట్ట కప్పాను. ఏమిటో కలలో వున్నట్టుగా నా వంక చూస్తోంది. పక్కనున్న రెండోపిల్లని చూచి "నీ పేరేమిటమ్మా" అని అడిగాను.

"శకుంతల."

"చూడు శకుంతలా! ఈ పదిరూపాయలూ నీ దగ్గర వుంచుకో. నేను వెళ్ళి డాక్టరును పిలుచుకు వస్తాను. అంతవరకూ నువ్వు ఇక్కడే వుండు."

డాక్టరు రోగిని పరీక్ష చేసిన అనంతరం నన్ను బయటికి తీసుకువెళ్ళి, "ఆ పిల్ల నీకు ఏమవుతుంది" అని అడిగాడు. ఏమవుతుందని చెప్పను?

"మా బంధువులే. ఇంతకీ వ్యాధి ఏమంటారు?"

"సిఫిలిస్. బాగా ముదిరిపోయింది. ఇంజక్షన్లు ఇవ్వాలి."

"ఇవ్వండి- మీరేం కావాలన్నా తెచ్చిపెడతాం. చెప్పండి."

"రోగిని విశ్రాంతిగా పడుకోనివ్వండి. నేను నిద్ర పట్టడానికి మందు ఇస్తాను. రేపు ఉదయం నుంచి మందు ప్రారంభిస్తాను."

డాక్టరు మందు యిచ్చి తన దోవను వెళ్ళిపోయాడు. నేను నా గదికి వచ్చి ఎప్పుడు తెల్లవారుతుందా అని రాత్రంతా ఆలోచిస్తూ గడిపాను. మహా

ప్రయాసమీద రాత్రంతా గడిచి తెల్లవారింది. నా పనులన్నీ పూర్తి చేసుకుని బజారు బయలుదేరాను. కనపడ్డ మంచి మంచి పళ్ళన్నీ కొనుక్కుని ఒక బుట్టలో వేసుకుని సరోజిని యింటికి వెళ్ళాను. అక్కడికి చేరేసరికి సుమారు తొమ్మిదిగంటలు అయ్యింది. తలుపు తట్టగానే శకుంతల వచ్చి తలుపు తీసింది. ఎంతో తృష్ణతో ఆ పిల్ల కళ్ళు పళ్ళబుట్టను వెదుకుతున్నాయి.

"సరోజినికి ఎలా వుంది?" అని అడిగాను.

ఉలిక్కిపడి ఒక్కసారి నావంక చూసి మెల్లిగా "సరోజిని పోయింది."

"ఏమన్నావ్" అని అరిచాను.

"రాత్రి మీరు వెళ్ళారు. పన్నెండు గంటలదాకా బాగానే నిద్రపోయింది. పన్నెండు గంటలకి పెద్ద పెద్ద కేకలు వేసింది. ఆ బాధ నేను చూడలేకపోయాను. తరువాత కొంచెం సేపటికి ప్రాణం పోయింది. తెల్లారితే నలుగురూ పోగవుతారు, గొడవవుతుందని శవాన్ని అప్పటికప్పుడే దహనం చేయటానికి పంపేసింది."

నేను యిక ఏమీ వినలేదు. ఆ బుట్ట అక్కడ పారేసి స్మశానానికి పరుగెత్తాను. కాని సరోజ నాకు ఏ రూపంలో కూడా కనిపించలేదు. స్మశానం మూలమూలలా గాలించాను. 'సరోజినీ' అని యేడుస్తూ ఎలుగెత్తి పిలిచాను. సమాధానం రాలేదు. తనకేమీ సంబంధం లేనట్టుగా నది ప్రవహించి పోతోంది. ప్రకృతి నావంక చూచి ఒక్కసారి పకపక నవ్వినట్లయింది. నాకు తెలియకుండానే నాకు స్పృహ తప్పింది. సరోజిని లేని స్మశానంలో నేను ప్రాణంతో పడిపోయాను.

ఎన్ని గంటలకి, లేకపోతే ఎన్ని రోజులకి స్పృహ వచ్చిందో నాకు తెలియదు. కాని కళ్ళు విప్పి చూచేసరికి హాస్పిటల్‌లో వున్నాను. కొన్ని రోజులకి హృదయంలోని శోకం కరుడుగట్టుకు పోయింది. మామూలు ప్రజలలో పడ్డాను. కాని ఒంటరిగా వున్నప్పుడల్లా దైవం విస్మరించిన ఆ పిల్లది నా మనస్సులో మెదులుతుంది.

ఎక్కడ వుందో! ఏమి చేస్తోందో!!

- కృష్ణా పత్రిక, *15-10-55*